
# న్యాయం నిదురపోయింది



రచన :
శ్రీ వేముగంటి శ్రీనివాసరావు.

(గతసంచిక తరువాయి)

"అగ్గిపుల్ల గీసి దీపాన్ని అంటిస్తు "అదేంటయ్యా... ఇంకా తెలుసుకోలేవా" అంటూ చెప్పడం మొదలెట్టాడు. ఆ నాటి రాత్రి మూడవజాము వరకూ వారిద్దరూ ఆ గదిలోనే మంతనాలు సాగించారు.

అనుకున్న ప్రకారం తెల్లవారేసరికల్లా నారాయణ మరి కొందరు అనుచరులు, వెంకయ్య ఇంటిముందు హాజరయ్యారు. అంత ప్రొద్దునే తన ఇంటికి వచ్చిన పెద్ద మనిషినీ అతని పరివారాన్ని చూచి తత్తరపడుతూ! కుర్చీ వేసి కూర్చోమంటూ మర్యాద చేశాడు వెంకయ్య.

"వెంకయ్యా—ఇప్పుడు నేను నీవు చేసే మర్యాదల్ను అందుకునేందుకు రాలేదు. నీవు అయ్యగారికి ఇవ్వవలసిన బాకీ వడ్డీతోసహా వసూలు చేసుకు వెళ్ళేందుకు వచ్చాను."

"బాబూ–నేను... నేను మీ అయ్యగారికి బాకా, మాటలు తడబడినాయి. గొంతులో తడి ఆరిపోయింది మాట పెగల్లేదు వెంకయ్యకు.

"అదేనయ్యా నీ కొడుకు పెళ్ళికి తీసుకున్న నగదు అక్షరాల మూడువేలు! భూపతిగారి నమ్మినబంటు నారాయణ గర్వంగా భుజాలు ఎగరవేస్తు చెప్పాడు. ఒక్కసారిగా వెంకయ్య గుండెను కొట్టుకోవడం మానివేసినాయి. కాళ్ళక్రింద భూమి గిర్రున తిరిగినట్లయింది. భూపతిగారి విశ్వరూపం కళ్ళముందు మెదిలింది. కోపానికి చిహ్నంగా కళ్ళల్లో ఎర్రజీరలు తొంగి చూసినాయి. పిడికిల్లు బిగుసుకొన్నవి. "అబద్ధం...అన్యాయం" గొంతు జీరబోయి మాటలు గొంతులోనే మిగిలిపోయినవి. మాటలు రెట్టిస్తు "ఏదయ్యా అబద్ధం" నీవు అయ్యగారి వద్ద అప్పు తీసుకోవడమా! ఏదయ్యా అన్యాయం, అయ్యగారు తిరిగి అప్పుమాట ఎత్తడమా! అన్న మాటకా! అన్నం పెట్టిన వారినీ మరిచిపోవద్దయ్యా నీకిచ్చిన బాకీ అసలు వడ్డీతోసహా 5160 రూపాయలు సాయంత్రంలోగా కట్టాలి అంటూ వెళ్ళిపోయాడు. దిక్కుతోచని వాడిలా పందిరి గుంజకే ఒరిగి నిలుచుండి పోయాడు వెంకయ్య. వెంకయ్య భార్యవియోగుడు. ఏబయి ఏళ్ళుపైబడ్డ పెద్దమనిషి. పెద్దలనాటి ఆస్తి రెండెకరాల మాగాణీ ఒక యిల్లూ, కొడుకు రాము కోడలు లక్ష్మి తప్ప చెప్పుకునే వారెవ్వరూ లేరు. ఇంటర్మీడియట్ చదివే రామును ఇంక పై చదువులు చెప్పించి పెద్ద ఉద్యోగస్తున్ని చేయాలని . తండ్రిగా అతని ఆశ అభిలాష.

రాజు తలుచుకుంటె దెబ్బలకు కొదువలేనట్లు, భూపతిగారు తలుచుకుంటె ఎంతటి అగాయిత్యాన్నయినా సులభంగా చెయ్యగలరు. మరునాడు భూపతిరావుగారి మనుషులు వెంకయ్య కోతకు వచ్చిన పైరుపొలాన్ని కొనుక్కున్నారు. "భూపతిగారూ ఇది అన్యాయం. నా బొందిలో ప్రాణమున్నంతవరకూ మీరు చేసే ఇలాంటి అక్రమాలు సాగనివ్వనని అడ్డు నిలిచిన వెంకయ్యను శాశ్వతంగా మృత్యువు ఎదుర్కొంది. ఇది చూడలేని పల్లె ప్రజల మనసులు బాధతో మూల్గినవి. హత్యని చేసుకున్న హత్య పోలీసాఫీసర్ల దృష్టిలో ఆత్మహత్యగా మారింది. ఇది సహించలేక ముందుకొచ్చిన నాటి యువతరం పాతాళానికి అణగద్రొక్కబడింది. న్యాయం నిదురబోయి, అన్యాయం పురివిప్పి నాట్యమాడింది. అమాయకులైన పల్లెప్రజలకు జరిగే అన్యాయం ప్రకృతి ఎలుగెత్తి ఏడ్చింది కాని వినే నాధుడు లేకపోయాడు.

పరీక్ష వ్రాసి సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చిన రాముకు తండ్రి మరణవార్తే స్వాగతం పలికింది. శాశ్వతంగా ఇహలోక బంధాలు త్రెంచుకుని నిర్మలంగా, నిశ్చింతగా చచ్చిపడియున్న తండ్రిప్రక్కనే శోకదేవతలా విలపించే భార్యను చూస్తుంటె రాము

హృదయం దుఃఖంతో నిండిపోయింది. "నాన్నా..." అంటూ తండ్రి శవంపైపడి గుండెలు పగిలేలా ఏడ్చాడు, జరుగవలసిన తతంగమంతా జరిగింది. తమ కుటుంబానికి జరిగిన అన్యాయం ఇతరులవల్ల తెలుసుకొన్న రాము మనసులో పగా ద్వేషం రగులుకొంది.

రాము పట్టుదల చూస్తే లక్ష్మిలో భయం చోటు చేసుకుంది. ఆడవాళ్ళు అబలలని మరోమారు నిరూపించింది.

"ఏమండి నాకేమిటో భయంగా వుందండీ! పట్టణం పోయి అక్కడ ఏదో ఒక ఉద్యోగం చేసుకు బ్రతుకలేమా!" తనలోని అసమర్థతను బయటపెట్టింది లక్ష్మి.

ఒకరికి భయపడి దూరంగా పోయేంత పిరికివాన్ని కాదు లక్ష్మి నీతి, నిజాయితీగా వున్నంతకాలము మనం ఎవరికీ భయపడాల్సిన అవసరమూ లేదు. ఈ భూపతంటె నాకు ఓ లెక్కాలేదు." అతనిలో ప్రతీకార వాంఛ తొంగి చూసింది. కోపంతో మొహం ఎర్రబడింది.

"ఏమండీ...ఇటు చూడండీ. మామగారు మాత్రం నీతిగా నిజాయితీగా లేరంటారా. మరి ఎందుకు ఆ దుర్మార్గులు అలా చేశారంటారు. నా విషయంగానండీ నన్ను ఆ భూపతి పరం చేయకుండేందుకై వానిని ఎదిరించాడు. అందుకు మృత్యువువాత పడ్డాడు. మీ తండ్రిని చంపాడని మీరతన్ని ఎదిరిస్తే మీ గతీ అంతేనండీ అంటూ ఏడుస్తు బ్రతిమిలాడింది పట్టు విడవని విక్రమార్కునిలా. ఆఖరును తన కన్నీళ్ళతో అతని మనసు కరిగించి ఒప్పుకునేలా చేసింది లక్ష్మి.

♦ ♦ ♦

పట్టణంలో ప్రవేశించి ఉద్యోగం వేటలో ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా చంద్రాయణం చేసిన రాము మనసులో నిరాశ చెంది నిస్పృహ పేరుకుపోయింది. లంచం పెడితేగానీ ఉద్యోగం రాని ఈ రోజుల్లో తన గోడు విని దయతలంచి ఉద్యోగం యిచ్చేవారెవ్వరు? బజారులో ఆకాశాలంటుకొని పెరిగే దినసరి వస్తువుల ధరలు దీనికి తోడు, నిరుద్యోగ సమస్య రాముకు ఊపిరి సలుపనివ్వలేదు. చేతిలో డబ్బుకాస్త హరీమన్నది రాను రానూ పూటగడవడమే గగనమయింది. అయినా భార్యాభర్తలు ఒకరి నొకరు అర్థం చేసుకుని ఒకరిపై ఒకరికి మనసులో ప్రేమా, జాలీ, అనురాగం గూడు కట్టుకొని వున్నంత వరకూ అది ఎటువంటి విపరీత పరిణామాలకు దారితీయదు. పైగా ఎన్ని యిబ్బందులు ఎదురైనా సహనంతో ఎదుర్కొగలరు. ఆశ మనిషిని అధఃపాతాళానికి క్రుంగదొక్కినా బల్లిలా దాన్ని కరుచుకుని వ్రేలాడుతూంటారు. ఆశానిరాశల మధ్య తేలియాడుతున్న రాముకు ఇంటిముందర "పోస్ట్" అన్న కేక వినిపించింది. చిమ్మచీకటిలో గమ్యం చేరే దారి కనబడక అల్లాడే మనిషికి, సుగమనానికి టార్చిలైట్ దొరికినట్లు సంతోషం పట్టలేక "లక్ష్మి—లక్ష్మి—" అంటూ కేకేశాడు రాము.

"అబ్బ-బ్బ-బ్బా పెంకు లెగిరిపోయేలా ఏమిటా అరుపులు అద్దెకొంపండీ బాబూ!" పైటకొంగుకు చేతులు తుడుచుకుంటూ వచ్చింది లక్ష్మి. జవాబు చెప్పకుండా రెండు బుజాలు దొరకబుచ్చుకుని గిరగిరా త్రిప్పి అందిన చోటల్లా ముద్దులతో నింపివేశాడు, తన సంతోషాన్ని మాటలతో చెప్పలేక.

రాము బాహుబంధం నుండి విడిపించుకో చూస్తూ "చిన్నపిల్లవానిలా వేళాపాలా లేకుండా ఏమిటా పని విడవండీ" అంటూ చిన్నగా మందలించింది.

మనిషికి ఎక్కువ సంతోషం మనసులో తొంగి చూసినప్పుడు కలలోలాగా అతడేమి చేస్తాడో తెలియదు. మనసు మొద్దుబారిపోగా మమతానురాగాలు పంచే మనిషి దగ్గరుంటె దరికి తీసుకోకుండా ఎలా వుంటాడు. ఆమె మాటలు వినిపించుకోకుండానే, "లక్ష్మి నాకు ఉద్యోగం వచ్చింది,లక్ష్మి నాకు ఉద్యోగం వచ్చింది" అంటూ ఆమెను తన ఆప్యాయంగా హృదయానికి హత్తుకున్నాడు రాము.

రాము పరిష్వంగలోని తీయదనాన్ననుభవిస్తూ నమ్మలేకుండా చూసింది లక్ష్మి.

"నిజం లక్ష్మి" అంటూ గాలికి రెపరెపలాడుతున్న జాయినింగ్ ఆర్డర్‌ను చూపించాడు రాము.

"అమ్మయ్య ఇన్నిరోజులకు ఆ వెంకటేశ్వరునికి దయ కలిగింది" అంటూ నిశ్చింతగా నిట్టూర్చింది లక్ష్మి.

"అన్యాయం-లక్ష్మి-అన్యాయం. చెట్టంత మొగున్ని నిన్ను భరించే భర్తను పక్కనుండగా ఎక్కడోవున్న ఏడుకొండలవాణ్ణి స్మరించడం. అచ్చం నాటక ఫక్కీలో అన్న మాటలకి నవ్వకుండా వుండలేకపోయింది లక్ష్మి. వర్షం వెలసిన తరువాత వుండే నిర్మలమైన ప్రకృతిలా ఇన్ని రోజులకు లక్ష్మి ముఖంలో చిరునవ్వు చూడ

కలిగాడు రాము. ప్రశాంతంగా నిర్విచారంగా రోజులు దొర్లిపోతున్నాయ్ యిద్దరిలో ఒక విధమైన నిశ్చింత తొంగి చూసింది.

మానవుడు అనుకున్నది అనుకున్నట్టు నెరవేరితే దేవున్ని కూడా లెక్క చేయక ఎదిరిస్తాడు. అందుకే నీటిలో చిన్న రాయిపడి కల్లోలం లేవదీసినట్లు ప్రశాంతంగా నడిచే కుటుంబంలో అశాంతి రేపి మనుషుల మనసుల్లో విషబీజాలు సృష్టించింది కాలగమనం.

◆ ◆ ◆

రాము పడుకున్న మాటే కాని ఆలోచనలు మాత్రం నిద్రను దూరం చేసినవి. ఎంత వద్దనుకున్నా ఆ రోజు ఆ రోజు జరిగిన సంఘటనే కళ్ళముందు మెదిలింది. గుట్టగా వున్న ఫైళ్ళమధ్య తలదూర్చి దేన్నో వెతుకుతున్న రాముకు మేనేజర్ వద్దనుండి పిలుపు వచ్చింది. ఫైళ్ళను పక్కకు నెట్టి మేనేజరు గదిలో అడుగెట్టిన రాము ఎదురుగా వున్న పెద్దమనిషిని చూసి స్థాణువులా నిలుచుండిపోయాడు. ఇద్దరి చూపులూ కలుసుకొని వుండిపోయినవి. సందేహంలేదు అతనే.

కాలం ఎంత విచిత్రమైనది. తాను ఎవరికైతే తప్పుకొని ఇంతదూరం వచ్చాడో అతడే ఈనాడు తన అధికారిగా కనబడి మానిపోయే పుండుపై కారం చల్లినట్లు అనిగిపోయి శిథిలమైయున్న ఆలోచనల ఆవేశపు పుట్టను కదిలించాడు. అన్యాయంగా తమ భూమిని ఆక్రమించి, తండ్రిని హత్యచేసి తమ కుటుంబాన్ని విచ్ఛిన్నంచేసిన భూపతిరావుపై ప్రతీకారం తీర్చుకోమని మనసు ప్రేరేపించింది. అలా కూర్చున్నవాన్ని ఉన్నట్లే గొంతుపిసికి చంపేస్తే లేకపోతే ఇనప కుర్చీతో తల పగలకొడ్తే ఆలోచనలను కార్యరూపం దాల్చబోతుంటే వద్దు అంటూ అంతరాత్మ అడ్డుపడింది. "అవును నీకు భూపతి తీరని ఘోర అన్యాయమే చేశాడు. దానికి ప్రతీకారంగా నీవు అతన్ని చంపుతావా? అవును! చంపుతావు. అయితే బాధపడేదెవ్వరు? నీవు! నీ భార్య, చచ్చి అతను సుఖంగానే వుంటాడు. కాని జైల్లో మ్రగ్గిపోతూ నీవు ఇంట్లో తిండిగింజలు లేక కడుపు కాల్తుంటే, బిచ్చమెత్తుకునే నీ భార్య లక్ష్మి కృశించిపోతారు."

"ఛీఛీ__అలా జరగడానికి వీలులేదు. నాలో వూపిరి వున్నంత వరకూ లక్ష్మి దూరంగా వుండలేను__ఆలోచనలు ప్రక్కకు నెట్టి మానేజరు పోస్ట్ చేయమని ఇచ్చిన వుత్తరాన్ని తీసుకొని బైటపడ్డాడు. తను ఆ చోటు విడిచి వచ్చినా ఆలోచనలు మాత్రం తనను వెంటాడుతూనే వున్నాయ్. మానిపోయిన గాయాలు మళ్ళీ రేగుతుంటే అక్కడ పనిచేయడమేలా...అందుకే అందుకే ఉద్యోగాన్ని వదులుకుంటే ఇది సబబుగానే తోచింది. రేపే ఉద్యోగానికి రాజీనామా ఇవ్వాలని మనసులో గట్టిగా తీర్మానించుకొని తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు రాము.




మీకు తెలుసా? మీరు ధరించియున్నది.

సి. టెక్స్

బనియన్లని?

లేనిచో, నేడే "సి. టెక్స్" బనియన్లను కొని ధరించండి.

అవి:- చక్కని అల్లిక - సరైన కొలత, దీర్ఘకాల మన్నిక, ధరించితే హాయి నిచ్చును.

: తయారించువారు :

Grams: CEETEX Phone: 21290

CHOWDAMBIKAI KNITTING CO.,

KAMARAJ ROAD : : TIRUPUR - 638604

తిమిరపు మేలి ముసుగులో దాగున్న లోకాన్ని తన వెలుగులతో నింపివేసిన సూర్యకిరణాల తాకిడికి మేలుకొన్న రాము టైం చూసుకొని "అబ్బా, ఏడు గంటలు కావస్తుంటే" అనుకుంటూ తొందరతొందరగా స్నానం అదీ కానిచ్చి శ్రీమతి యిచ్చే వేడివేడి కాఫీ త్రాగి కుర్చీలో కూర్చుండి సిగరెట్ పొగ రింగులురింగులుగా వదులుతున్న రాముకు వీధి తలుపు టక్...టక్‌మన్న చప్పుడు వినిపించింది.

ఇంత ప్రొద్దున్నే వచ్చిందెవ్వరా అని వెళ్ళి గడియ తీశాడు. ఎదురుగా ఖాకీదుస్తుల్లో పోలీస్ ఆఫీసరు మరో ఇద్దరు కానిస్టేబుల్లు.

అడుగు లోనికేస్తూ "రాము అంటే మీరేనా?" అని అడిగాడు ఆఫీసర్.

తడుముకోకుండా "ఔనూ! ... నేనే అన్నాడు రాము.

"మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను" అంటూ కానిస్టేబుల్ నుండి బేడీలు అందుకున్నాడు.

"సార్" అంటూ నిర్ఘాంతపోతూ అడుగు వెనక్కి వేశాడు రాము.

"ఔను. నిన్న మీరు ఆఫీసులో పదివేల రూపాయలు దొంగిలించారని భూపతిరావుగారు మాకు రిపోర్టిచ్చారు" అంటూ మరో మాటకు అవకాశమివ్వకుండా చేతులకు బేడీలు తగిలించాడు సబిన్స్పెక్టర్. లక్ష్మి... కన్నీళ్ళు, వారి లాయర్ అరుపులూ తెలిసిన వారి స్వాంతన వాక్యాలు ఎవ్వీ రామును కాపాడలేకపోయాయి. రాముకు జస్టిస్ ఆరునెలల కఠిన కారాగార శిక్ష విధించాడు.

* * *

కాలం ఎవ్వరికోసం ఆగదు. తనకేదో కొంప మునిగినట్లు ఉరుకుల పరుగులతో వుంటుంది. కాని సుఖఃసంతోషాల్లో మునిగి తేలేవారికి ఎంతో తొందరలూ గడిచినట్లు కష్టాలే అనుభవించేవారికి ఒక్కొక్క రోజే ఎన్నో ఏండ్లుగా అనిపిస్తువుంటుంది.

రాముకు శిక్ష పూర్తయింది. జైల్లో నుండి స్వేచ్ఛాస్వాతంత్ర్యముగల సంఘంలో అడుగుపెట్టాడు. అతనికి మొట్టమొదటగా జ్ఞాపకం వచ్చిన వ్యక్తి లక్ష్మి "పాపం లక్ష్మి నన్ను చేసుకుని సుఖఃపడింది ఇంత వరకూ లేదు. అన్నీ కష్టాలే. ఈ ఆరు నెలలు ఎలా గడిపిందో ఏమిటో నన్ను చూసేందుకు కూడా రాలేదు. కారణమేమిటో? ఎన్ని కష్టాలనుభవిస్తుందో? ఇకనుండి లక్ష్మికి ఏ కష్టమూ కలుగకుండా పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను" అని ఒక నిర్ణయానికి వచ్చి ఇంటి వైపుగా మధురమైన ఊహల్తో అడుగులు వేశాడు అయినా ఆలోచనలు విడవడం లేదు.

"పోగానే లక్ష్మి ఎవరా అని ఆశ్చర్యంగా చూస్తుంది. తరువాత నన్నేర్పాటు చేయగానే "ఏమండీ" అంటూ వచ్చినా ఎదపైవాలి ఏడుస్తుంది. లక్ష్మి నడుం చుట్టూ చేయవేసి తలను హృదయానికి హత్తుకుంటూ ధైర్యం చెప్పాలి ఇకనుండి మనం విడిపోమని. ఆ దేవుడైనా విడదీయలేడని ఊరడించాలి. అయినా ఊరకుండమంటే చేతుల్లోకి తీసుకొని గిరగిరా త్రిప్పాలి అపుడు...వద్దండీ అంటూ బ్రతిమాలుతోంది. తరువాత దింపి—మధురమైన ఆలోచనల్లో పడిపోయాడు రాము. ఆలోచనల్లో మళ్ళా ఆలోచనలు. ప్రియసిని గూర్చిన ఆలోచనలే గొప్పవి. అన్ని ఆలోచనల్లో బాహ్యస్మృతివుంటుంది కాని దీని కలా వుండదు. కలల్లో తేలిపోతారు. మేఘాలపైన నడుస్తారు. కాని ప్రక్కన జరిగే విషయాలపై శ్రద్ధవుండదు.

అలవాటున్నవి కావున ఆ వీధికే తీసుకెళ్ళాయి కాళ్ళు. ఆ ఇంటిముందు టక్కున ఆపాయి. ఆలోచనలనుండి బయటపడ్డాడు రాము. అది తనున్న వీధే కాని తనున్న ఇంటి ముందు తనూ తన భార్య ఎంతో ఇష్టపడి పెంచుకున్న మాలతీ లత లేదు. గుబురుగావుండి పందిరినంతా ఆక్రమించుకొని వికసించిన పూలతో ఆ వాడకెల్లా మధురమైన వాసనలు పంచే మాలతీ లత యొక్క ఆనవాళ్ళు కూడా లేవు. ఇంటిముందు ఇద్దరు పిల్లలు ఆడుకుంటూవున్నారు. ఇంటి ప్రక్కవారి పిల్లకాబోలు లక్ష్మికి పిల్లలంటే ఎంత ఇష్టం అందుకే ప్రక్కవారి పిల్లలతో కాలక్షేపం చేస్తుంది కావచ్చు.

(సశేషం)

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.